## ఐతారం ముచ్చట్లు కవి సమ్మేళనం

భీంపూర్, నవంబర్ 17 : ప్రతి ఆదివారం క్రమం తప్పక నిర్వహించే ఐతారం ముచ్చట్లు వేదికన కవి సమ్మేళనం నిరంతరం కొనసాగుతున్నది. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కవులు ఆదివారం గూగుల్ మీట్‌తో కవి సమ్మేళనం నిర్వహించారు. కవులు ప్రస్తుత కాలమాన అంశాలను వస్తువులుగా తీసుకుని చక్కటి కవితలు వినిపించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి డాక్టర్ ఉదారి నారాయణ, కవులు బీ బాబన్న, లక్ష్మీనారాయణ, త్రివేణి, శైలజ, రిజ్వాన్, బ్రహ్మ శ్రీనివాస్, గంగన్న, నల్లగొండ రమేశ్, నర్సింహులు, భీంరెడ్డి , సురేశ్ పాల్గొన్నారు.

## సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ మాణిక్‌రెడ్డి

సారంగాపూర్, నవంబర్ 17: బీరవెల్లి గ్రామంలో ఆలూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం పీఏసీఎస్ చైర్మన్ మాణిక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులకు సన్నరకం వడ్లను అమ్ముకొని మోసపోకుండా ఉండేందుకు ఈ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లక్కడి శంకర్‌రెడ్డి, డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, నాయకులు ఇస్మాయిల్, రైస్ అహ్మద్, వంగ లింగారెడ్డి, నల్ల లక్ష్మారెడ్డి, నిమ్మల రాజు, శ్రీధర్, నర్సారెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులను అరెస్టు చేయడం అన్యాయం

కుంటాల, నవంబర్ 17 : బాసర ట్రిపుల్ ఐటీలో ఇటీవల స్వాతిప్రియ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. విద్యార్థినికి మద్దతుగా ఆందోళన చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థులను అరెస్టు చేయడం అన్యాయమని బీజేపీ మండలాధ్యక్షుడు నర్సయ్య, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సూర్యవంశీ సాయి అన్నారు. ఆదివారం కుంటాలలో వారు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ట్రిపుల్ ఐటీ బాసరలోని సమస్యలు ప్రభుత్వానికి పట్టింపు లేకుండా ఉందని మండిపడ్డారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్రాక్టర్‌పై వచ్చి బాసర ట్రిపుల్ ఐటీ గోడ దూకి లోనికి ప్రవేశించారని మండిపడ్డారు. ఇప్పుడు కనిపించడం లేదని విమర్శించారు. సమావేశంలో నాయకులు వెంకట్, లక్ష్మణ్ పటేల్, శ్రీను పాల్గొన్నారు.

## నేడు గ్రామసభ సమావేశం

ఇచ్చోడ, నవంబర్ 17: ఇచ్చోడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు గ్రామసభ నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సూర్యప్రకాశ్ తెలిపారు. ఎంపీడీవో లక్ష్మణ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు హాజరుకావాలని కోరారు.

## ముగిసిన కార్తీక మాసం పూజలు

ఎదులాపురం, నవంబర్ 17 : ఆదిలాబాద్‌లోని శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠంలో ఆదివారంతో కార్తీక మాసం పూజలు ముగిశాయి. మఠాధిపతి యోగానంద సరస్వతి ఆధ్వర్యంలో భక్తులు దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉట్టి మహా ప్రసాద వితరణ చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED HELPERS

jobs Apply Now!

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## ముగిసిన ఈజీఎస్ ప్రజావేదిక



సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

కడెం, నవంబర్ 17 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ 15వ ప్రజావేదిక ఆదివారం ముగిసింది. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు రూ.13.65 కోట్లతో చేపట్టిన పనులపై ఇటీవల సామాజిక తనిఖీ బృందం సభ్యులు వారం రోజుల పాటు తనిఖీ నిర్వహించారు. వివిధ రకాల పనులకు సంబంధించిన నివేదికలను సిబ్బంది అధికారులకు చదివి వినిపించారు. కొన్ని పంచాయతీల్లో పొరపాట్లు దొర్లినట్లు అధికారులు తేల్చారు. దానికి బాధ్యులైన వారిని తిరిగి చెల్లించాలని డీఆర్డీవో ఆదేశించారు. రూ.13.65 కోట్లతో చేపట్టిన పనులపై మొత్తం రూ.15572 నిధుల దుర్వినియోగం జరిగినట్లు తెల్చారు. అయితే వీటిని పంచాయతీ కార్యదర్శులకు రూ.6232, ఈసీలకు రూ.3311, క్షేత్ర సహాయకులకు రూ.2717, సాంకేతిక సహాయకులకు రూ.3312 రికవరీ చేసినట్లు డీఆర్డీవో విజయలక్ష్మి వెల్లడించారు. అయితే సిబ్బంది పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ, వెంకటేశ్వర్లు, హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, డీవీవో లక్ష్మయ్య, అంబుడ్స్‌మెన్ నవీన్, ఏపీవో జయదేవ్, టీఏ, ఎఫ్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలి



రక్తదానం చేస్తున్న మహిళలు

బేల, నవంబర్ 17 : గ్రామంలోని ప్రతి ఒక్కరూ బాబా చూపిన సన్మార్గంలో నడుచుకుంటూ ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలని సిద్ధేశ్వర సంస్థాన్ పట్నాపూర్ అధ్యక్షుడు కేశవ్ ఇంగులే అన్నారు. సోన్‌ఖాన్ గ్రామంలో శ్రీ పరమహంస సద్గురు పూలాజీ బాబా ధ్యాన మందిరం 25వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామస్తులు, పూలాజీబాబా శిష్యులు కలిసి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బాబా పల్లకీతో శోభాయాత్ర నిర్వహించారు. ఆలయం వద్ద మహా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలోని మహిళలు, యువతి యువకులు సైతం స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో ధ్యాన కేంద్రం అధ్యక్షుడు గుర్నులే సతీశ్, వామన్ ఇంగులే, దీపక్ షిండే, నందా కిశోర్, మహిళలు పాల్గొన్నారు.

## ధర్మ సమాజ్ పార్టీ మండల కమిటీ ఎన్నిక

బోథ్, నవంబర్ 17: బోథ్‌లో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గణేశ్ మహారాజ్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా కొండమడుగు గణేశ్, ఉపాధ్యక్షులుగా పెందూర్ జల్‌దేవ్, నామోడే గజానంద్, కలిగేటి ప్రవీణ్, కుందూర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, కార్యదర్శులుగా రాథోడ్ నరేందర్, రాకేశ్, ట్రెజరర్‌గా బిక్క రాకేశ్, కమిటీ సభ్యులుగా జూకంటి ప్రవీణ్‌కుమార్, కొత్తూర్ రాజేశ్వర్, జెల్ల రఘువీర్, కొండమడుగు హరీశ్, కార్తీక్, గోపాల్, శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు.

### ఆలయ హుండీ లెక్కింపు

సోన్, నవంబర్ 17: బొప్పారం గ్రామంలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న హన్మాండ్ల పండుగ సందర్భంగా ఆదివారం ఆలయ హుండీ లెక్కింపును నిర్వహించారు. భక్తులు సమర్పించిన నగదు రూ. 62,500, బంగారం 2.30 గ్రాములు, వెండి 49 గ్రాములు సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్యాషియర్ దేశెట్టి నవీన్, రైటర్ నవీన్‌రెడ్డి, వీడీసీ సభ్యులు బి.జి.రెడ్డి, గౌతంరెడ్డి, లోలం నర్సయ్య పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



గంజాల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ భీంరెడ్డి

సోన్, నవంబర్ 17 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ భీంరెడ్డి అన్నారు. ఆదివారం సోన్ మండలం గంజాల్, పాక్‌పట్ల, మాదాపూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బర్మగంగదాస్, డైరెక్టర్లు విజయశేఖర్, మధుకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో శ్రీహరి, మార గంగారెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాంనర్సింహారెడ్డి, రమేశ్‌రెడ్డి, మోహినొద్దీన్, నవీన్, వీడీసీ సభ్యులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## విస్తరణ ఉన్నట్టా..లేనట్టా..!

- రోడ్డుకు అనుకుని స్తంభాల ఏర్పాటు..!
- ఇప్పటికే రోడ్డు మధ్యలో హైమస్ట్ లైట్లు ఏర్పాటు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు



రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం

ఖానాపూర్ టౌన్, నవంబర్ 17 : ఇరుకు రోడ్లతో ఇబ్బందులు పడుతున్న పట్టణవాసుల సమస్యను పరిష్కరించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖానాపూర్ శివారులోని జంగల్ హనుమాన్ ఆలయం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ఇరువైపులా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించింది. పట్టణానికి చెందిన కొందరు గృహ యాజమానులు రోడ్డు విస్తరణపై కోర్టును ఆశ్రయించడంతో పాటు వెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఈ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఖానాపూర్ పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతాయని ఆశించిన పట్టణ ప్రజలకు నిరాశే మిగిలింది. రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామని ముందుగానే మున్సిపల్ ఆధ్వర్యంలో రోడ్డు మధ్యలో హైమస్ట్ లైట్లు ఏర్పాటు చేసిన నేపథ్యంలో పనులు నిలిచిపోయి ఉన్న రోడ్డు కాస్త ఇరుకుగా మారింది. అలాగే దీనికి తోడు ఇరుకు రోడ్లను అనుకుని విద్యుత్ శాఖ అధికారులు నూతన స్తంభాలను ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు త్వరగా స్పందించి రోడ్డు విస్తరణ పనులు త్వరగా చేపట్టి పాదచారులకు, వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ రాంసింగ్‌ను వివరణ కోరగా మున్సిపల్ శాఖ అధికారులు తమకు హద్దులు చూపకపోవడంతో కరెంట్ సరాఫరాలో ప్రజలకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశ్యంతోనే పాత స్తంభాల ప్రాంతంలోనే నూతన స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొందరు గృహ యాజమానులు విస్తరణ పనులపై కోర్టుకు వెళ్లడం వల్ల హద్దులు నిర్ణయించలేకపోయామని మున్సిపల్ కమిషనర్ మనోహర్ తెలిపారు.



ఇరుకు రోడ్లతో నిలిచిపోయిన ట్రాఫిక్

## రాజ్యాంగ పరమైన హక్కులు కల్పించాలి

ఉట్నూర్, నవంబర్ 17: ప్రభుత్వాలు ప్రజలకు రాజ్యాంగ పరమైన హక్కులు కల్పించాల్సిన బాధ్యత నాయకులపై ఉందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావ్ అన్నారు. ఆదివారం ఉట్నూర్‌లోని రాంజీగోండ్ భవన్‌లో 10వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు జీవించే హక్కులను రక్షించాలన్నారు. అనంతరం రెండు జిల్లాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### ఆదిలాబాద్ జిల్లా కమిటీ

అధ్యక్షుడిగా రఘోత్తమరెడ్డి, ఉపాధ్యక్షులుగా గోపీనాథ్, జ్ఞానేశ్వర్, శ్యాంరావ్, సూరజ్, ప్రధాన కార్యదర్శిగా అతీష కుమార్, కార్యదర్శులుగా రాజు, శంకర్ యాదవ్, వినోద్, క్రాంతి, ప్రజ్ఞాశీల్‌ను ఎన్నుకున్నారు.

### కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కమిటీ

అధ్యక్షుడిగా సుజియత్ ఖాన్, ఉపాధ్యక్షులుగా సిడాం తిరుపతి, ఆత్రం ధర్మారావ్, ప్రధాన కార్యదర్శిగా వెంకట్, కార్యదర్శులుగా రాజ్‌కుమార్, అశోక్, కమల, శ్రీధర్, సభ్యులుగా సందీప్ కుమార్, శేఖర్, దస్తగిరి, ధర్మేందర్, దేవేందర్‌ను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న ఆత్రం భుజంగ్‌రావ్

## తెలుగింటి పండరీపురం.. విఠలేశ్వరాలయం

- పాండురంగడి సన్నిధిలో ఈ నెల 22 నుంచి సప్తాహ వేడుకలు
- 29న వేడుకలకు ముగింపు
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



కుభీర్‌లోని విఠలేశ్వరాలయం

కుభీర్, నవంబర్ 17: కుభీర్‌లో మరో పండరీపురంగా వెలుగొందుతున్న విఠలేశ్వర ఆలయంలో ఈ నెల 29న నిర్వహించే జాతరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఈ నెల 22న సప్తాహ వేడుకలు ప్రారంభిస్తారు. జాతర సందర్భంగా మందిరాలను రంగులతో అలంకరించారు.



విఠలరుక్మాయి ఉత్సవ మూర్తులు

ఈ జాతరకు వివిధ గ్రామాలతో పాటు పక్కనున్న మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. సుమారు 50 క్వింటాళ్ల బియ్యంతో పెద్ద ఎత్తున్న అన్నదానం నిర్వహిస్తారు. ఇప్పటికే విఠలేశ్వర ఆలయంతో పాటు గణపతి మందిరం, శనీశ్వర ఆలయం, మహా సమాధి మందిరాలకు రంగులు వేస్తున్నారు.

### ఆలయంలో జరిగే కార్యక్రమాలు

ఈ నెల 22న ప్రారంభమయ్యే సప్తాహ వేడుకలు 29వ తేదీ శుక్రవారం కాగడ హారతి, శోభాయాత్ర, జాతర, అన్నదానంతో ముగిస్తాయి. ఏడు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో భజనలు, కీర్తనలు కొనసాగుతాయి.

## ఉత్సాహంగా చదరంగం ఎంపిక పోటీలు

ఎదులాపురం, నవంబర్ 17 : ఆదిలాబాద్‌లోని చాణక్య ఇంటర్నేషనల్ పాఠశాలలో జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-9, 13 బాలబాలికల చదరంగం ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు చెందిన బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన బాలబాలికలను ఎంపిక చేస్తామని, వారు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య, డైరెక్టర్ అమీరుద్దీన్, పోటీల నిర్వాహకుడు నన్నపు స్వామి, పీఈటీ కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

## నిర్మల్‌లో కవి సమ్మేళనం

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 17 : నిర్మల్‌లోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఆదివారం రాష్ట్ర స్థాయి కలం స్నేహం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలం స్నేహం వ్యవస్థాపకుడు గోపాల్ ఆచార్య హాజరై మాట్లాడారు. తమ సంస్థ ద్వారా యువకులను, గ గాయకులను ప్రోత్సహించడం వారికి సినిమాలలో అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా జాతీయ ఉపాధ్యక్షుడు హరి రమణ, అడ్మిన్లు గీతాశ్రీ, రాధిక, గౌతమి, సుధ, సరళ పలువురు కవితలు వినిపించారు. పలువురు కవులను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేవారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దేవిప్రియ, కడారి దశరథ్, పోతన్న, దేవిక, వాణిశ్రీ, నాగరాజు, అశోక్‌కుమార్, రాజ్‌కుమార్‌రెడ్డి, పీసర శ్రీనివాస్‌గౌడ్, బసవరాజు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

## ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న మాదిగ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవేంద్ర ప్రసాద్

ఎదులాపురం, నవంబర్ 17 : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామని మాట ఇచ్చి తప్పడం వలన మాదిగ ఉపకులాలు తీవ్రంగా నష్టపోతున్నారని మాదిగ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవేంద్ర ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని బీసీ భవనంలో మాదిగ ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగు గంగయ్య మాదిగ అధ్యక్షతన మాదిగ ఉపకులాల ఉద్యోగుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో సుదీర్ఘంగా 30 సంవత్సరాలలో ఎన్నో పోరాటాలు త్యాగాలు ద్వారా సాధించుకున్న ఎస్సీ వర్గీకరణను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేసి వర్గీకరణ అమలు చేసుకునేంత వరకు పోరాటాలు చేస్తామని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉప్పరిపల్లి నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షులు కొల్లూరు శంకర్, వసంత్, సాంబశివరావు, సీనియర్ నాయకులు సందూరి వినయ్‌సాగర్, గుర్రాల ఆశన్న, రాజన్న, నర్సయ్య, అగ్గిమల్ల భూమన్న, ఆరెపల్లి గణేశ్, వెంకటేశ్, సుధాకర్, శివ, రాజు, రమేశ్, శ్రీకర్, మనోజ్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

తాంసి, నవంబర్ 17: మండలంలోని గ్రామాల్లో ఆదివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఎన్యుమరేటర్లు చేపట్టగా సూపర్‌వైజర్లు పరిశీలించారు. సర్వేలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్, నవంబర్ 17 : సమగ్ర కుటుంబ కులగణన సర్వేను పక్కగా ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని ఎంపీవో గోవర్ధన్ సూచించారు. ఆదివారం మండలంలోని సిర్గాపూర్, న్యూలోలం, కాల్వ గ్రామాల్లో చేపడుతున్న ఇంటింటి కులగణన సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం సర్వే నిర్వహిస్తున్న స్థానిక పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు శ్రావణ్‌కుమార్, ఫీల్డ్‌అసిస్టెంట్ గోవిందుల మహేశ్ ఉన్నారు.



తాంసి: జామిడిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో మోహన్ రెడ్డి

భీంపూర్, నవంబర్ 17 : కరంజి(టీ), గోముత్రి, అంతర్గాం గ్రామాల్లో ఆదివారం సిబ్బంది ఇంటింటి సర్వే చేశారు. తహసీల్దార్ నలందప్రియ , ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, డీటీ హరిదాస్, ఆర్ఐ రాందాస్ పర్యవేక్షణ చేశారు. ఉపాధ్యాయులు ముంతాజ్ బేగం, దత్తు , కార్యదర్శులు లోకేశ్, వినోద్, సిబ్బంది మాద విఠల్, అశోక్, దేవీదాస్, రవి, బాలు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

తాంసి(భీంపూర్), నవంబర్ 17: పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య చేసుకున్న ఘటన భీంపూర్ మండలం బురకపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 16వ తేదీన కుడ్మెత రాంచందర్(38) తన సోదరుడి వరుస వ్యక్తి ఇంట్లో లేనప్పుడు వారి ఇంటికి వెళ్లగా భార్య, గ్రామస్తులు మందలించారు. ఇది అవమానంగా భావించిన రాంచందర్ అదే రోజు మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయి తరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెతికిన ఆచూకీ లభించలేదు. ఆదివారం పురుగుల మందు తాగి విగతా జీవిగా కనిపించాడు. మృతుడికి భార్య మమత, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ముంతాజ్ తెలిపారు.

## ఆదివారం పీచర ఊరంతా దావత్



గ్రామస్తులుకు భోజనం అందిస్తున్న డాక్టర్ దామోదర్ రెడ్డి

లక్ష్మణచాంద, నవంబర్ 17: లక్ష్మణచాంద మండలం పీచర గ్రామానికి చెందిన డాక్టర్ దామోదర్ రెడ్డి 40 సంవత్సరాల క్రితం ఎంబీబీఎస్ పూర్తి చేసి నిర్మల్‌లో ప్రభుత్వ దవాఖాన, బైంసా ప్రభుత్వ దవాఖానలో డాక్టర్‌గా సుదీర్ఘకాలం పని చేసి సేవలందించారు. సందర్భానుసారంగా పీచర గ్రామానికి ఆయన వచ్చి వెళ్తుండేవారు. అవసరమైన సందర్భంగా గ్రామాభివృద్ధిలో తన వంతు సహాయం అందించారు. తన చిన్ననాటి స్నేహితులు, గ్రామస్తులను కలుసుకోవాలని భావించిన ఆయన ఆదివారం పీచర గ్రామానికి మొత్తం దావత్ ఇచ్చాడు. అందరిని కలుసుకుని గత స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. ఆదివారం ఎవరూ ఇంటిలో వంట చేసుకోవద్దని తను గ్రామం అంతా దావత్ ఇస్తున్నట్లు దండోరా వేయించి, ఇంటింటికీ సమాచారం అందించారు. డాక్టర్‌సాబ్ అందిస్తున్న ఆహ్వానాన్ని గ్రామస్తులంతా స్వీకరించి డాక్టర్ దామోదర్ రెడ్డిని కలిసి మురిసిపోయారు. ఆప్యాయంగా గ్రామస్తులందరిని కలుపుకుని భోజనం చేశారు. తనతో చిన్ననాటి నుంచి అనుబంధం ఉన్న గ్రామస్తులను, మిత్రులను కలిసి గుర్తుకు తెచ్చుకున్నాడు.

## దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం, నవంబర్ 17: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జగ్‌రాం అంతర్వేబేడి, పీజీ సమన్వయకర్త రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ (బోటనీ)లో 24 సీట్లు, ఎంఎస్సీ (జూలోజి)లో 1 సీటు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు సీపీజీఈటీ-2024 పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్‌లో సీటు లభించిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదని తెలిపారు. వారు ప్రాసెసింగ్ ఫీజు రూ.2100, ట్యూషన్ ఫీజు రూ.35800 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ లోపు ఒక జిరాక్స్ సెట్, డిగ్రీ మెమో, ప్రొవిజనల్ తదితర సర్టిఫికెట్లలో కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

## వరి గడ్డిని తగలబెట్టొద్దు

ఎదులాపురం, నవంబర్ 17: వరి కోతల తర్వాత వరి కొయ్యాలని తగలబెట్టడం ద్వారా వాతావరణ కాలుష్యంతో ఊపిరితిత్తులతో వాయుసంబంధ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. నెలలో సారం దెబ్బతింటుందన్నారు. నెలలో సూక్ష్మ జీవులు దెబ్బతిని జీవవైవిధ్యం దెబ్బతింటుంది. పంట తీసిన తర్వాత వరి కొయ్యాలని కలియదున్నడం ద్వారా నెలలో సారం పెరుగుతుందన్నారు. వరి కోత తర్వాత సింగల్ సుపారీ ఫాస్పేట్‌ని నెలలో వేయడం ద్వారా వరి కొయ్యాలు త్వరగా కుళ్లి నేలలో కలిసిపోయే ఆస్కారం కలదన్నారు. రైతులు సూచనలు పాటించి పర్యావరణానికి, తమ నేలలకు మేలు చేసినవారు అవుతారన్నారు.

## చిన్నరథంపై గజవాహన సేవ..



చిన్నరథంపై గజ వాహనాన్ని ఊరేగిస్తున్న భక్తులు

జైనథ్, నవంబర్ 17 : జైనథ్‌లోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం చిన్న రథంపై గజవాహన సేవ ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ఆవరణలో చిన్న రథంపై గజ వాహనాన్ని పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. దారి పొడవును భక్తులు రథం వద్ద పూజలు చేసి స్వామిని దర్శించుకున్నారు.